

23న వికారాబాద్‌లో మెగా జాబ్ మేళా

కులకచర్ల, జూన్ 20: ఈ నెల 23న వికారాబాద్‌లో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ గురువారం పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాబ్ మేళాను నిర్వహిస్తోందని తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళా ఉదయం 10గంటల నుంచి ఉంటుందని తెలిపారు.



మేడ్చల్ మార్కెట్ ప్రధాన రోడ్డులో నిలిపి సరుకులను అన్‌లోడ్ చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ డీసీఎం

ఇరుకు రోడ్డులో సరుకులు అన్‌లోడ్

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

మేడ్చల్ టౌన్, జూన్ 20 : ఇరుకుగా ఉన్న మేడ్చల్ పట్టణ ప్రధాన మార్కెట్ రోడ్డుపై కొందరు ట్రాన్స్‌పోర్టర్లు తమ వాహనాలు నిలిపి సరుకులను అన్‌లోడ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వివేకానంద చౌరస్తా నుంచి మహావీర్ చౌరస్తా వరకు గల పాత జాతీయ రహదారి మార్కెట్‌లో సరుకులు అన్‌లోడ్ చేసేందుకు లోకల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. ఐదు పది నిమిషాల్లో అన్‌లోడ్ చేస్తే అంత ఇబ్బంది ఉండేది కాదు. కానీ దుకాణాల వద్ద గంటలకొద్దీ వాహనాలను నిలుపుతుండడంతో ఇరుకు రోడ్డులో రాకపోకలు స్తంభిస్తున్నాయి. కనీసం ద్విచక్ర వాహనాలైనా పోలేని పరిస్థితి తలెత్తుతోంది. కార్లు, ఆటోలు వస్తే అంతే సంగతులు! అన్‌లోడింగ్‌కు గంటల సమయం పడుతుండటంతో మార్కెట్‌లో ట్రాఫిక్ జామై స్థానికులు, పనుల మీద పట్టణానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవటంతో రోజూ ఉదయం, సాయంత్రం మార్కెట్‌లో పాదచారులు కూడా ముందుకు పోలేని పరిస్థితి నెలకుంటోంది. ప్రధాన మార్కెట్‌లో 60 ఫీట్ల రోడ్డు ఉంది. రోడ్డుపై పండ్ల దుకాణదారులు, ఇతర చిరు వ్యాపారులు కొట్లు, తోపుడు బండ్లు పెట్టుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా కొందరు ఫుట్‌పాత్‌పై దుకాణాలు పెట్టుకున్నారు. దీంతో రోడ్డు ఇరువైపులా పది ఫీట్ల చొప్పున కుచించుకుపోయింది. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాలు నిలిపితే మరింత ఇబ్బందికరంగా మారుతోంది. మార్కెట్‌కు మరో రోడ్డు లేక వాహనదారులు ఇరుకు రోడ్డులో రాకపోకలు కొనసాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌పోర్ట్ డీసీఎంలు, మినీ ట్రక్కులు, లారీలను మార్కెట్‌లో ప్రధాన రోడ్డులో నిషేధించి సమస్యను పరిష్కరించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు.




పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మల్లెమోనిగూడ పాఠశాలను సందర్శించిన డీఈవో

పరిగి, జూన్ 20 : 'సమస్యల ఒడి-సర్కారు బడి' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు డీఈవో రేణుకాదేవి పరిగి మున్సిపల్ పరిధి మల్లెమోనిగూడ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను పరిశీలించారు. నెలకొన్న సమస్యలపై, కల్పించాల్సిన వసతులపై వివరాలను సేకరించి కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు.

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు అలర్టయ్యారు. మంత్రి పదవిని దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఒకరికే అమాత్య పదవి దక్కే అవకాశాలుండడంతో ఆ ఒక్కరు ఎవరన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ పదవి కోసం కాంగ్రెస్ నుంచి ప్రధానంగా ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ పోటీ పడుతుండగా, కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా అధికార పార్టీలో చేరి మంత్రి పదవి పొందాలన్న ఆలోచనతో పావులు కదుపుతున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి టచ్‌లోకి వెళ్లినట్టు చర్చ జరుగుతోంది. ఈ పోటీలో మంత్రి పదవి పొందే లక్ ఎవరికి దక్కుతుందోనని అధికార పార్టీ కార్యకర్తలు, జిల్లా వాసులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



కిస్సా కుర్సీ కా!

అమాత్య పదవి దక్కేదెవరికో?

- మంత్రివర్గ విస్తరణలో ఒకరికే అవకాశం!
- రేస్‌లో మల్‌రెడ్డి, టీఆర్ఆర్, మహేందర్‌రెడ్డి
- అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో సీనియర్లు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ మంతనాలు సాగిస్తున్నట్టు ప్రచారం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయని విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఆరుగురికి ఇంకా అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల తరువాత మంత్రివర్గ విస్తరణ చేపడతామని అప్పట్లో కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఇపుడు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు మొదలు పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని సీనియర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే యత్నంలో ఉన్నారు. గత మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికి కూడా ఛాన్స్ దొరకలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కరికైనా మంత్రివర్గంలో ఛాన్స్ లభించే అవకాశం ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో కేవలం నాలుగు చోట్ల మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల నుంచే ఎన్నిక కావడం గమనార్హం. పెద్దగా పోటీ లేకపోవడంతో వికారాబాద్ నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌కు మంత్రవర్గంలో ఛాన్స్ లభిస్తుందని భావించారు. అయితే ఆయన్ని స్పీకర్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఇంకా ముగ్గురే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు రేస్‌లో ఉన్నారు. ఇందులో పరిగి నుంచి గెలుపొందిన వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నుంచి గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. వికారాబాద్ డీసీసీ చీఫ్ రామ్మోహన్‌రెడ్డి పరిగి నుంచి గెలుపొందారు. ఎన్నికలకు ముందు పార్టీని పటిష్టం చేసి వికారాబాద్ జిల్లాలో నాలుగు స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో కీలకంగా పనిచేశారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ పదవి రేసులో ఆయనకు కొంత ప్లస్‌గా మారే అవకాశం ఉంది. కొందరు కాంగ్రెస్ పెద్దలతో తనకున్న పరిచయాల ద్వారా ఆయన మంత్రివర్గంలో బెర్త్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా తాను అందరికంటే సీనియర్ అయినందున అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెలో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరిన సమయంలో మహేందర్‌రెడ్డికి కొందరు పార్టీ పెద్దలు మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అయితే, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీచేసిన ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఓడిపోవడం ఆయనకు మైనస్‌గా మారింది. ఈ సీటు గెలిచుంటే ఆయనకు మంత్రిపదవికి అవకాశాలు మెరుగయ్యేవి. కానీ ఇపుడు ఆయనకు పరిస్థితులు అంత అనుకూలంగా లేవు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బేరసారాలు!

మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు జరుగుతున్న నేపథ్యంలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీ ఫిరాయించనున్నట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. నగర శివార్లలోని 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో మెజార్టీ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు సీఎం రేవంత్‌రెడ్డికి టచ్‌లో ఉన్నారు. మరికొందరు నియోజకవర్గ అభివృద్ధి పేరుతో సీఎంను వ్యక్తిగతంగా కలిసిన విషయం తెలిసిందే. వీరంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే, వీరిలో కొందరు మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. శివారు ప్రాంతాలకు చెందిన ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిపదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీలోకి వస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్లు తెలిసింది. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే వీరిలో ఇద్దరు, ముగ్గురిని మంత్రివర్గంలో తీసుకోవచ్చనే ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే నగర శివార్ల నుంచి ఒకరికి మంత్రివర్గంలో అవకాశం దొరుకుతుందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సామాజిక సమీకరణాలు కూడా చూడాల్సిన అవసరం ఉన్నందున మంత్రివర్గ విస్తరణలో ఎవరికి ఛాన్స్ దొరుకుతుందనే విషయంలో చివరి వరకు సస్పెన్స్ కొనసాగవచ్చని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు.

పూర్తి ఆయకట్టుకు నీరందించేలా పనులు

- కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శించిన ఈఎన్‌సీ అనిల్‌కుమార్
- కాలువలు, అలుగు, తూముల పరిశీలన

ధారూరు, జూన్ 20: వికారాబాద్ జిల్లాలో గల కోట్‌పల్లి ప్రాజెక్టు కింద పూర్తి ఆయకట్టుకు నీరందేలా ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ అన్నారు. ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టును నీటిపారుదల చీఫ్ ఇంజినీర్ ధర్మానాయక్, ఇతర అధికారులతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ప్రాజెక్టు అలుగు, కాలువ తూమును, బేబీ కెనాల్ షెట్టర్, కట్ట కుడి, ఎడమ కాలువల తూములను పరిశీలించారు. నాగసమందర్ వరకు 4కిలో మీటర్ల వరకు నడుచుకుంటూ వెళ్లి కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలను, పాడైన డిస్ట్రిబ్యూటర్లను, తూములను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ధారూరు, పెద్దేముల్ మండలాల్లోని ఆయకట్టుకు నీరందించే కాలువలను, తూములను చైన్ల వారీగా పరిశీలించారు. ఎక్కడేపనులు చేయాలో గుర్తించి ప్రతిపాదనలు త్వరగా తనకు పంపాలని జిల్లా ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. అనంతరం అనిల్‌కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ఆదేశాలతో ప్రాజెక్టును పరిశీలించానని చెప్పారు. ప్రాజెక్టు పూర్తి ఆయకట్టుకు నీరందేలా ప్రణాళిక ప్రకారం పనులు చేస్తామన్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణకు ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగును పరిశీలిస్తున్న రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్

ఏఈఈ పోస్టులను భర్తీ చేస్తాం

రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి అంజేశామని, ప్రభుత్వం ఈ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తుందని అనిల్‌కుమార్ చెప్పారు. అలాగే గ్యాంగ్‌మెన్ పోస్టులను స్థానికులతో భర్తీచేసి ప్రాజెక్టులను, కాలువలను, వాటి ఆస్తులను పర్యవేక్షిస్తామని వివరించారు. ఈఎన్‌సీ వెంట ఎస్ఈ రంగారెడ్డి, ఈఈ సుందర్, డీఈ భాస్కర్, కాంగ్రెస్ నాయకుడు మాణిక్‌రెడ్డి, అధికారులు ఉన్నారు. కాగా వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టులను బాగుచేయాలని తాండూర్ ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌ను కోరారు. ఈ రెండు ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు నీరందించేందుకు ఆధునికీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ ప్రాజెక్టుల కింద ఏయే పనులు చేపట్టాలో నివేదిక ఇవ్వాలని ఎస్ఈ, ఈఈ సుందర్‌లను అనిల్‌కుమార్ ఆదేశించారు.



షెటర్లు లేని కాలువ తూమును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్‌కుమార్

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అందరి బాధ్యత

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ

వికారాబాద్, జూన్ 20 : ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం లక్ష్మీబాయి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై ప్రాధాన్యం ఇస్తోందని, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోందన్నారు. విద్యార్థులు చదువులో నైపుణ్యం, క్రీడల్లో ప్రతిభను చాటాలన్నారు. బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికల రక్షణకు స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, స్కూల్‌లో సదుపాయాలు కల్పించి హాస్పిటళ్లను ఏర్పాటు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. నులి పురుగుల వల్ల ఎదురయ్యే సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులకు, టీచర్లకు సూచించారు. సంవత్సరంలో రెండు సార్లు ఈ మాత్రలు వేస్తారని, జిల్లాలో 1-19 వయస్సు గల చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ రోజు తప్పిన వారికి 27వ తేదీన కచ్చితంగా మాత్రలు వేయించాలని సూచించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్, ప్రిన్సిపాల్ రమణమ్మ, టీచర్లు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

విద్యతోనే సమాజంలో సమూల మార్పు

- బడిని చదువు అందించే గుడిగా భావించాలి
- విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జూన్ 20 : విద్యాభివృద్ధితోనే సమాజంలో సమూల మార్పులు, దేశ భవిష్యత్తును మార్చగలమన్న మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం కొడంగల్‌లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. బాలికల పాఠశాలలో విద్యార్థినులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిని చదువులు అందించే గుడిగా భావించి విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో చదుకోవాలన్నారు. విద్యతోనే దేశ భవిష్యత్తును మార్చగలమన్న అబ్దుల్ కలాం వ్యాఖ్యలను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తుచేశారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం 19సంవత్సరాల్లోపు వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు ఆల్బెండజోల్‌ను పంపిణీ చేయాలన్నారు. నులి పురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం లాంటి రుగ్మతలు కలుగుతాయని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతీ యేట రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీ ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలన్నారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండేలా పిచ్చి మొక్కలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్, డీఈవో రేణుకాదేవి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంపీపీ ముద్దప్పదేశ్ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, హెచ్‌ఎం రామ్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజా పాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్ : గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఏవైనా తప్పులు దొర్లినా, అర్హులకు పథకాలు వర్తించకున్నా ప్రస్తుతం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరి చూసుకోవాలని, అవసరమైతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపల్ ఆఫీసుల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించామని, అర్హులకు ఇబ్బందులు కలగకుండా ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పేదలు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500కు గ్యాస్ సిలిండర్ పొందేందుకు రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డులు, ప్రజాపాలన రసీదుతో సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని తప్పులను సరిచేసుకొని పథకాలను పొందొచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

దామర్‌చెడ్‌లో తాగునీటి కష్టాలు

బషీరాబాద్, జూన్ 20:దామర్‌చెడ్ గ్రామ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గోరిగడ్డ చౌరస్తాలోని డైరెక్ట్ పంపింగ్ సిస్టం నిచేయడం లేదు. మరమ్మతుకు రావడంతో బోరు మోటారు కనెక్షన్ తీసేశారు. దీంతో బీసీ కాలనీకి నీరందడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే ఉన్న మరో చేతిపంపు, మజీద్ దగ్గరలోని మరో హ్యాండ్‌బోర్ మరమ్మతుకు రావడంతో నీటి కోసం పాట్లు పడుతున్నామని చెబుతున్నారు. ఈ విషయమై ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తే మరమ్మతులకు నిధులు లేవని చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. చేతి పంపులు మరమ్మతుకు వచ్చి 3 నెలలైనా పట్టించుకోవడంలేదన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరొస్తున్నా అందరికీ సక్రమంగా రావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



గోరిగడ్డ చౌరస్తాలో కనెక్షన్ తీసేసిన బోరు మోటారు



పని చేయని చేతిపంపు

ఉద్యోగులకు ఆధార్ లింక్ తప్పని సరి

తాండూరు, జూన్ 20: ప్రభుత్వ ఉద్యోగులకు తప్పని సరిగా ఆధార్ లింకు చేయాల్సిందే అంటూ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరి అండ్ అకౌంట్స్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నెలకి సబందించిన శాలరీ బిల్లుతో పాటు తమ ఉద్యోగులందరు ఆధార్ కార్డు నెంబర్లను నమోదు చేసినట్లు సంబంధిత డీడీవో అధికారి ధ్రువపత్రాలు జారీచేస్తే తప్ప జీతాలను ట్రెజరీ అదికారులు మంజూరు చేయడానికి వీలు లేదు. జిల్లా ట్రెజరి అధికారులకు, ఎస్టీవో, జేడీలకు రాష్ట్ర ఖజనాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కచ్చితంగా పోర్టల్‌లో ఆధార్ నంబరు నమోదు ఉంటే తప్ప జీతాలను చెల్లించడానికి వీలులేదని ఈ ఉత్తర్వుల సారాంశం. జూలై నెలలో చెల్లించే వేతనానికి సంబంధించి పంపించే జీతాల బిల్లుతో పాటు ఆయా శాఖల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఆధార్ నంబర్లతో కూడిన జాబితాను కూడా వెంట జతరపచాలని సూచించారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ఉత్తర్వులు శాఖల వారీగా రానున్నాయి.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

నులిపురుగుల రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలి

చేవెళ్ల, జూన్ 20 : ప్రతీ ఒక్కరు నులిపురుగుల రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని, పిల్లల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఎంతో ఉపయోగపడుతాయని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యలు తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని ఊరెళ్ల పరిధిలో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. వారు మాట్లాడుతూ ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు విధిగా ఇవ్వాలని సూచించారు. నులిపురుగులతో రక్తహీనత, పోషకాహారం లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపులో నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు

- విద్యార్థుల తల్లిదండ్రులు
- మల్కాపూర్ హెచ్‌ఎంపై విద్యాశాఖ అధికారుల ఫిర్యాదు

తాండూరు రూరల్, జూన్ 20: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మాకొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మాజీ సర్పంచ్ ఎస్.విజయలక్ష్మితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యనాథ్ సీనియర్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల పదోన్నతి రావడంతో వైద్యనాథ్ అదే పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా వారం రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. అయితే ఆ పాఠశాలలో గతేడాది 331 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 290మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 14మంది ఉపాధ్యాయులు పాఠశాలలో కొనసాగుతున్నారు. వీరిలో కూడా వివిధ కారణాలతో 7, 8వ తరగతులకు సంబంధించిన సుమారు 15మంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. అయితే విధి నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు పాఠశాలకు సంబంధించిన విషయాలపై ఎస్‌ఎంసీ ఛైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని మాజీ సర్పంచ్ విజయలక్ష్మి గురువారం పాఠశాలకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడాపాఠశాలకు సంబంధించిన నిధుల విషయంలో కూడా అలసత్వం వహించారని ఆరోపించారు. పదోన్నతిపై హెచ్‌ఎంగా వచ్చిన వైద్యనాథ్‌ను వెంటనే పాఠశాల నుంచి బదిలీ చేయాలని కోరారు. ఈ విషయంపై డీఈవో, ఎంఈవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదరణ కమిటీ ఛైర్మన్ కుర్వ లక్ష్మి, మాజీ ఎస్‌ఎంసీ ఛైర్మన్ అల్లావుద్దీన్, మాజీ ఉపసర్పంచ్‌లు అబ్దుల్ మజీద్, కాశీనాథ్, గ్రామస్తులు షైనుద్దీన్, మహేందర్‌రెడ్డి, కిష్టప్ప ఉన్నారు. ఈ విషయమై హెచ్‌ఎం వైద్యనాథ్‌ను వివరణ కోరగా మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గత ఆరు సంవత్సరాలుగా సీనియర్ ఉపాధ్యాయుడిగా ఉంటూ గత రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాలలో సేవలందిస్తున్నానని తెలిపారు. పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పటికీ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో తనను పాఠశాలలో కొనసాగవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారని అన్నారు. అమ్మ ఆదర్శకమిటీ ద్వారా వచ్చిన నిధులు రూ.3లక్షల 25వేలు మంజూరయ్యాయని, వాటితో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించానన్నారు. ఇదే పాఠశాలకు గెజిటెడ్ హెచ్‌ఎంగా రావడంతో ఇక్కడే కొనసాగుతున్నారని అన్నారు. జరిగిన విషయాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల అభివృద్ధికి నిర్లక్ష్యం వహించకుండా పని చేస్తానని చెప్పారు. తనను ఇదే పాఠశాలలో కొనసాగించాలని హెచ్‌ఎం వైద్యనాథ్ గ్రామస్తులను కోరారు.



మల్కాపూర్‌లో హెచ్‌ఎం వైద్యనాథ్‌ను నిలదీస్తున్న మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు

నక్షబాట కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

షాబాద్, జూన్ 20 : మండల పరిధిలోని చందన్‌వెళ్లి నుంచి చందన్‌వెళ్లి చెరువు, అంతిరెడ్డిగూడ గ్రామం వరకు నక్షబాటను కబ్జాకు గురికాకుండా చూడాలని, బాటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చందన్‌వెళ్లి గ్రామస్థులు గురువారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చందన్‌వెళ్లి నుంచి చందన్‌వెళ్లి చెరువు, మాచన్‌పల్లి వరకు పూర్వం నుంచి నక్షబాట ఉందని, టీఎస్‌ఐఐసీ కంపెనీ వారు రోడ్డును మూసివేసి కబ్జాచేస్తున్నారని తెలిపారు. వారం క్రితం తహసీల్దార్‌కు ఈ విషయమై వినతి పత్రం ఇచ్చినా స్పందించడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నక్షబాట కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు చేవెళ్ల స్వామి, నర్సింహారావు, వేమారెడ్డి, ఆంజనేయులు, అనంతం, తదితరులున్నారు. కాగా, టీఎస్‌ఐఐసీ అధికారులతో చర్చించి గ్రామస్థులకు తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్వర్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న చందన్‌వెళ్లి గ్రామస్థులు

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

కొత్తూర్, జూన్ 20: రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరుతూ స్థానిక ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డికి గురువారి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో బదిలీలు, పదోన్నతులు జరుగుతున్నా.. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులకు మాత్రం ఎందుకు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన 10మండలాలు జిల్లాల పునర్విభజనలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో కలిసినందుకు బదిలీలు నిలిచిపోయావని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై తమ వంతు కృషి చేయాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.





బదిలీపై వెళ్తున్న ఎస్పీ కోటిరెడ్డికి ఘనంగా వీడ్కోలు

- పూల వర్షం కురిపిస్తున్న పోలీసులు
- వికారాబాద్‌లో పని చేయడం గౌరవంగా ఉంది: ఎస్పీ

వికారాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డికి పోలీసు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. రెండున్నర సంవత్సరాలు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన కోటిరెడ్డిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్‌జోన్ డీసీపీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎస్పీ కోటిరెడ్డి గురువారం తన విధుల నుంచి రిలీవ్ కాగా, జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది కవాతుతో ఇచ్చిన గౌరవ వందనాన్ని ఎస్పీ కోటిరెడ్డి స్వీకరించారు. అనంతరం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వికారాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చివరి రోజు వరకు జిల్లాలో ఎలాంటి శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా విధులు నిర్వహించామన్నారు. జిల్లాలో హోంగార్డు అధికారి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రతీఒక్కరు సమయస్ఫూర్తి, సమన్వయంతో పనిచేయడం వల్ల శాంతి భద్రతల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేవని చెప్పారు. జిల్లాలో పోలీసు అధికారులందరూ కలిసి ఒక టీం మాదిరిగా పనిచేశారన్నారు. తాను ఎక్కడకు వెళ్లినా వికారాబాద్ జిల్లాలో పని చేయడం తనకెంతో గౌరవంగా, ప్రత్యేకంగా ఉందని వ్యాఖ్యానించారు. పోలీసు శాఖకు సహకరించిన జిల్లా ప్రజలకు, ఇతర శాఖల అధికారులకు, మీడియాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దారి పొడవునా పూలవర్షంతో ఎస్పీకి నీరాజనం

జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంలో ఎస్పీ కోటిరెడ్డిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. దారిపొడవునా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీపై పూలవర్షం కురిపించి నీరాజనం పలికారు. ఎస్పీ సేవలను గుర్తుచేస్తూ ఎన్నెపల్లి చౌరస్తాలో ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న ఎస్పీ కోటిరెడ్డిపై పూలవర్షం కురిపిస్తూ ఘనంగా వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు

చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో..

పూడూరు: బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డికి మండలంలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఘనవీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐతోపాటు సిబ్బంది ఎస్పీని ఘనంగా సన్మానించారు.







కల్వకుర్తిని స్టడీ హబ్‌గా మారుస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, జూన్ 20: కల్వకుర్తి నియోజకవర్గాన్ని స్టడీ హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు గురువారం కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, నాయకులతో కలిసి అనువైన ప్రభుత్వ స్థలాలను కసిరెడ్డి పరిశీలించారు. సర్వేనెంబర్లు 260, 321లలో గల భూముల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఆయా విద్యాసంస్థల ఏర్పాటుకు అనువైన స్థలాలను నియోజకవర్గంలోని కడ్తాల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి వంద ఎకరాలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 20 ఎకరాలు, ఇతర ఉన్నత విద్యాలయాల ఏర్పాటుకు మరో 30 ఎకరాల ప్రభుత్వ భూముల సేకరణకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. భూముల గుర్తింపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తహసీల్దార్ లలిత, రంగారెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కసిరెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

ఆమనగల్లు : భూ సమస్యలను సత్వరంగా పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. ధరణిలో పొరపాట్లను సరిదిద్ది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండ చొరవ తీసుకోవాలన్నారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలు, ప్రభుత్వ భూముల గుర్తింపుపై నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో శ్రీను అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారిగా కార్యాలయానికి వచ్చిన కసిరెడ్డిని ఆయా మండలాల తహసీల్దార్లతో కలిసి ఆర్డీవో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలని కోరారు. తహసీల్దార్లు లలిత, ముంతాజ్, రంగారెడ్డి, ఇబ్రహీం, రవికుమార్, సునీల్, తదితరులున్నారు.



విరాహత్ అలీ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర బాధ్యులకు సన్మానం

వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జూన్ 20: నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర బాధ్యులను ఆ సంఘం జిల్లా నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఖమ్మంలో జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభల్లో గురువారం ప్రకటించిన కొత్త కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పకీరప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గంలో కీలకమైన రాష్ట్ర కార్యదర్శి, కోశాధికారి పదవులు దక్కేవిధంగా సహకరించిన సంఘం రాష్ట్ర, జాతీయ బాధ్యులకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఆరుద్రపైనే ఆశలు

- దోబూచులాడుతున్న రుతుపవనాలు
- నిరాశలో అన్నదాతలు

మేడ్చల్, జూన్ 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. మృగశిర కార్తెకంటే ముందే నైరుతి పలకరిస్తుందని వాతావరణశాఖ చెప్పడంతో వానాకాలం సాగుపై రైతులు ఆశపడ్డారు. రెండు రోజులు మురిపించిన వానలు ముఖం చాటేయడంతో నిరాశకు లోనవుతున్నారు. హైదరాబాద్‌లో రోజూ సాయంత్రం వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరశివారు కూతవేటు దూరంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో మాత్రం వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో జిల్లా రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రధానంగా మెట్ట పంటలను రైతులు పూర్తిగా వర్షాధారంగానే సాగుచేస్తుంటారు. కొంతమంది నైరుతిరాకపై నమ్మకంతో మొక్కజొన్న విత్తుకున్నారు. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో మొలక రాక దిగాలు చెందుతున్నారు.

సాగని నారుమడులు

మే నుంచి వాతావరణ శాఖ ముందస్తుగా నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలకు విస్తరిస్తాయని చెబుతూ వస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. సాధారణంగా మృగశిరకార్తెలో కురిసిన వర్షానికి మెట్ట పంట ప్రాంత రైతులు విత్తనాలు వేసుకుంటారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి, పెసర, కంది పైర్ల విత్తనాలు చల్లుకోవడం, విత్తుకోవడం చేస్తుంటారు. ఈసారి ఆ దిశగా పనులు సాగడం లేదు. బోరుబావుల కింద రైతులు ఆరుద్రలోనే నార్లు పోస్తుంటారు. ఎందుకంటే ప్రస్తుతం రైతులు 80శాతం మంది సన్నరకాల వరి వంగడాలు సాగు చేస్తున్నారు. అందులోనూ స్వల్పకాలిక వరివంగడాలు అంటే 120-125రోజుల కాల వ్యవధి ఉన్న పంటలు వేసుకుంటున్నారు. నవంబరు మొదటి వారంలో వానాకాలం కోతలు పూర్తయి యాసంగికి నార్లు పోసుకునేలా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. అందుకు అనుగుణంగా మృగశిర, ఆరుద్రలో వర్షాలు పడితే బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యతతో విద్యుత్ మోటార్ల సాయంతో ముందస్తుగా నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు మృగశిరలో సరైన వర్షం పడలేదు. సరైన సమయంలో వానలు కురవకపోవడంతో అన్ని పంటలపై ప్రభావం చూపుతోందని, ఇప్పటికే మొక్క జొన్న రైతులు వర్షాలు లేక మొలక రాక ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇక ఆరుద్రలోనైనా సరిపడా వర్షాలు కురుస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


తాండూరు రూరల్: నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రషీద్


దోమ: శివారెడ్డిపల్లిలో నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో మహేశ్‌బాబు


కులకచర్ల: మాత్రలు వేస్తున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్


శామీర్‌పేట: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న ఎంపీపీ

తాండూరు రూరల్, జూన్ 20 : విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జినుగుర్తి పీహెచ్‌సీ డాక్టర్ రషీద్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డాక్టర్ రషీద్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి 19ఏళ్లు నిండిన విద్యార్థులకు ఒక మాత్ర వేయాలన్నారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్రమే వేయాలని సూచించారు. ఈ మాత్రలతో పిల్లలకు కడుపునొప్పి తగ్గుతుందన్నారు. జినుగుర్తి ఉన్నత పాఠశాలలో 300మంది విద్యార్థులకు గ్రామ శివారులోని గిరిజన బాలికల వసతిగృహంలో 450 మంది విద్యార్థులకు మాత్రలు వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మృత్యుంజయస్వామి, సూపర్‌వైజర్ నీలమ్మ, సీహెచ్‌వో నర్సమ్మ, ఏఎన్‌ఎం కరుణశ్రీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాండూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తాండూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విద్యార్థులకు అల్బెండజోల్ మెడిసిన్ మాత్రలను వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో గురువారం నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. 36వార్డులోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మెప్మా ఆర్పీలు కలిసి మాత్రాలను చిన్నారులకు వేశారు.

యాలాల: మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనూష, సామాజిక ఆరోగ్య అధికారి చంద్రశేఖర్, హెచ్‌ఎం, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని చంచల్‌పేట్ గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను జడ్పీటీసీ కాలే జయమ్మ వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిగి: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో జీవరాజు అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నెం.01 పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్థానిక వైద్యాధికారి ప్రవీణ్‌తో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం గోపాల్, ఎంపీహెచ్‌ఏ రాఘవేందర్ పాల్గొన్నారు.

కులకచర్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, వైద్యాధికారి వాజీయొద్దీన్, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో వైద్యాధికారిణి సౌమ్య గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామకృష్ణ ఎండీ.రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని శివారెడ్డిపల్లి యుపీఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎంపీడీవో మహేశ్‌బాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, పాఠశాల సిబ్బంది రియాన, వెంకటచారి, గౌతమ్, శ్రీనివాస్, అమృత, మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బొంరాస్‌పేట్ వైద్య సిబ్బంది హేమంత్‌కుమార్ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌యాదవ్, సీహెచ్‌వో శివరాజ్, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: జగ్గంగూడలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి నులిపురుగు నివారణ మాత్రలను గురువారం విద్యార్థులకు, చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం రాగిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రతీ విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని మండల వైద్యాధికారిణి సుజల జయ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శామీర్‌పేట: నులిపురుగులను నిర్మూలించి తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని ఎంపీపీ ఎల్లూబాయి పిలుపునిచ్చారు. గురువారం మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శామీర్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపీపీ ఎల్లూబాయి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. అదేవిధంగా మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు నులిపురుగుల నివారణపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కీసర: మండల పరిధిలోని ఆయా గ్రామాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1-19 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు మండల వైద్యాధికారి సరితఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

కీసర రూరల్: దమ్మాయిగూడలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీహరిగౌడ్, నాయకులు మోర నరహరిగౌడ్, ఆకాంక్ష, వెంకన్న, రేచల్, శివాని, సువర్ణ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 20: బీజేపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న 14రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం గరిష్ట చిల్లర ధరలను వెల్లడిస్తూ, వరికి రూ.117లుగా ప్రకటించింది. ఈ మేరకు నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి భువనేశ్వరి, నాయకులు రవీందర్‌రెడ్డి, కిషోర్, నరేష్, రాకేష్, ఆర్.జంగారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, బాలేష్, వెంకటేశ్వర్‌రావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

బషీరాబాద్, జూన్ 20: వానాకాలంలో సాగు చేసిన వివిధ రకాల పంట పొలాలను తాండూరు ఏడీఏ రుద్రమూర్తి గురువారం పరిశీలించారు. జీవన్గి గ్రామ శివారులో ఇటీవల విత్తిన పత్తి పంటను పరిశీలించిన ఆయన అక్కడున్న రైతులతో మాట్లాడారు. ప్రస్తుత ఆపత్కాల పరిస్థితులలో రైతులు పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తూ పలు సందేహాలను నివృత్తి చేశారు. పంట సాగు వివరాలను వ్యవసాయాధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

నాగారంలో త్వరలో గ్రంథాలయం సేవలు

కీసర రూరల్, జూన్ 20: త్వరలోనే నాగారంలో గ్రంథాలయ సేవలు అందుబాటులోకి రానున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. నాగారం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్‌బాబుతో కలసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతినిధి నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఆపాలి

పూడూరు, జూన్ 20: మండలంలోని కంకల్‌లో అక్రమ నిర్మాణం ఆపేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు విన్నవించారు. మండల తహసీల్దార్‌కు మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, ధర్మప్రచారక్ మహేందర్ వీహెచ్‌పీ మండల కార్యదర్శి బాల్‌రాజ్‌లు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

తాండూరు రూరల్, జూన్ 20: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మల్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం వైద్యనాథ్ అన్నారు. పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, విద్యాకమిటీ మాజీ చైర్మన్ హలవుద్దీన్, మాజీ ఉపసర్పంచ్ కాశీనాథ్, మహేందర్‌రెడ్డి, కిష్టప్ప, అమ్మ ఆదరణ కమిటీ ప్రతినిధి కురువలక్ష్మి, ఉపాధ్యాయులు మోహన్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టును అభివృద్ధి పరుస్తాం


పెద్దేముల్: మారెపల్లి కేజీబీవీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, జూన్ 20: కోట్‌పల్లి ప్రాజెక్టును అభివృద్ధి పరిచి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గొట్లపల్లి గ్రామశివారులో గల తెలంగాణ మోడల్‌స్కూల్‌లో రూ.18లక్షల వ్యయంతో చేపడుతున్న సైన్స్‌ల్యాబ్ కోసం శంకుస్థాపన చేశారు. పెద్దేముల్ జిల్లాపరిషత్ పాఠశాలకు రూ.27లక్షల వ్యయంతో అదనపు గదులు నిర్మాణానికి, మారెపల్లి సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో రూ.2.30కోట్ల వ్యయంతో సైన్స్ ల్యాబ్, టాయిలెట్స్, అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు గాజీపూర్ నారాయణరెడ్డి, రుద్రారం మహిపాల్‌రెడ్డి, సాయిని నారాయణరెడ్డి, ఉప్పరి మల్లేశం, లొంకనర్సిములు, కొమ్ముగోపాల్‌రెడ్డి, అంజయ్య, డీవై.నర్సింహులు, లాల్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలోని రూ.2కోట్ల 25 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.2కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులకు, ఎస్టీఆర్ కాలనీలో రూ.25లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, కౌన్సిలర్‌లు విజయదేవి, వెంకన్న, నీరజ బాల్‌రెడ్డి, మమత నాగరాజు, ప్రవీణ్ గౌడ్, నాయకులు బాతుల వెంకట్, డాక్టర్ సంపత్ కుమార్, హబీబ్ లాల, కమిషనర్ విక్రం సింహారెడ్డి, టీఎంసీ రాజేంద్ర ప్రసాద్, ఎంఈవో వెంకటయ్యలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

యాలాల: ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాలాల మండలానికి చెందిన 60మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, కాంగ్రెస్ యాలాల మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, యాలాల మండల అధికారులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ.. తప్పిన ముప్పు


తెగిపడిన విద్యుత్ తీగ

ధారూరు, జూన్ 20: ధారూరులోని కూరగాయల మార్కెట్‌లో విద్యుత్ లైన్‌కు ఉన్న విద్యుత్‌తీగ ఆకస్మాత్తుగా తెగిపడింది. ఈ సమయంలో స్కూల్ బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు విద్యుత్ తీగను చూసి పక్కకు పరుగులు తీయటంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ధారూరు నుంచి వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు వేళ్లే విద్యార్థులు బస్సు కోసం ధారూరు కూరగాయ మార్కెట్ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. ఈ సమయంలో పైన ఉన్న విద్యుత్ లైన్ నుంచి విద్యుత్ తీగ అకస్మత్తుగా తెగి విద్యార్థుల పక్కనే పడింది. ఇది గమనించిన విద్యార్థులు తీగను తొక్కకుండా దానికి తగలకుండా పక్కకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అనంతరం విద్యుత్ సిబ్బంది వచ్చి తెగిపడిన విద్యుత్ తీగను సరిచేశారు. విద్యుత్ తీగ విద్యార్థుల మీద పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నెల 23న జాబ్‌మేళా

దోమ, జూన్ 20: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఏపీ కళాశాలలో ఈనెల 23న 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు గల యువతీ, యువకుల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ అర్హత కలిగిన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 9642333668, సెల్‌నెంబరును సంప్రదించాలని కోరారు.

రైతులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు

వికారాబాద్, జూన్ 20: ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, ఇకో ఫామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటల సాగుపై రైతులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి ఏ.సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి రైతు శిక్షణ సదస్సు తాండూరులోని బాలాజీ టెంపుల్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 21(శనివారం) ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

పరిగి: పరిగి మునిసిపల్ పరిధిలోని గడ్డమీది బాలికల ప్రాథమిక పాఠశాలలోని బాలికలకు మలిపెద్ద నవీన్‌కుమార్ విద్యార్థులందరికీ ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నవీన్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలు పెట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కనకచారి, పాఠశాల కమిటీ చైర్మన్ కె.హేమలత, ఉపాధ్యాయులు వినీల, శ్రీశైలం, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి


తాండూరు రూరల్: వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

తాండూరు రూరల్, జూన్ 20 : తాండూరు పట్టణంలోని ప్రైవేటు స్కూళ్లలో ఫీజులను ప్రభుత్వం నియంత్రించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయం సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయులు అరుణ్, దీపక్‌లు ఉన్నారు.

బొంరాస్‌పేట్: ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా యజమాన్యాలు ఫీజులు వసూలు చేయాలని ఎంఈవో రాంరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టడి మెటీరియల్, యూనీఫాం, నోట్‌బుక్‌లు తదితర సామగ్రిని విక్రయించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలి

బొంరాస్‌పేట్: ప్రభుత్వ భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వకుండా చాలా రోజుల నుంచి కాలయాపన చేస్తున్నారని దళిత ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. బొంరాస్‌పేట్ తహసీల్దార్‌కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వడంతో పాటు ఒకరి భూమి మరొకరి పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో సరి చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 24న తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కేఎస్‌పీఎస్ జిల్లా నాయకులు లక్ష్మయ్య, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు లక్ష్మణ్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కీసర రూరల్:** పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులను నివారించవచ్చని నాగారం మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వార్డులో స్థానికులతో కలిసి గురువారం స్వచ్ఛంద శ్రమదానం చేసారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు రోడ్లను ఊడ్చారు. ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ప్రవీణ్, స్థానికులు ఉపేందర్, మోహన్‌నాయక్, మున్సిప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట్:** 2024 టెన్త్ పరీక్షల్లో లాల్‌గడి జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను సాధించిన టాపర్లను ప్రముఖ సంఘసేవకుడు చంద నాగభూషణం అభినందిస్తూ రూ.10వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రకాశ్, భానుప్రకాశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** రక్తదానంతో ప్రాణదాతలవ్వాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తెలిపారు. కులకచర్లలో కుమ్మరి స్వామి జన్మదినం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ జిల్లా నాయకురాలు సౌమ్య వెంకట్‌రాంరెడ్డి, చంద్రలింగం, స్థానికులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** సమాజంలోని ప్రతీఒక్కరు నిత్యం యోగాసనాలు చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువు శ్రీ విజయ ప్రతాప్ మహారాజ్ గురూజీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో యోగా గురువు విజయ ప్రతాప్ మహారాజ్ గురూజీ విద్యార్థులకు యోగా విద్యపై అవగాహన కల్పించారు. యోగా గురువు విద్యార్థులతో వివిధ రకాల యోగాసనాలను చేయించారు. పిల్లలు, విద్యార్థులు, పెద్దలు ప్రతి రోజు యోగాసనాలను అభ్యాసంగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని, ప్రశాంత జీవితాన్ని గడపవచ్చని యోగా గురువు విద్యార్థులకు హితవు పలికారు.

క్రైం కార్నర్

పట్టపగలు జ్యువెలరీ షాపులో దోపిడీ యత్నం

● ప్రతిఘటించిన షాపు యజమాని ● కత్తితో దాడిచేసి పరారైన దొంగలు
● మేడ్చల్‌లో ఘటన.. స్థానికంగా కలకలం


దుకాణంలో కత్తితో బెదిరిస్తున్న దొంగ


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేషూరాం

మేడ్చల్ టౌన్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల ఓ బంగారు ఆభరణాల దుకాణంలో ఇద్దరు దుండగులు చొరబడి దుకాణ యజమానిపై కత్తితో దాడిచేసి దోచుకునే ప్రయత్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ పోలీస్ స్టేషన్ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న జగదాంబ జ్యువెలరీ షాపునకు గురువారం మధ్యాహ్నం బురఖా ధరించిన ఓ వ్యక్తి, హెల్మెట్ ధరించిన మరో వ్యక్తి బైక్‌పై వచ్చారు. మొదట బురఖా ధరించిన మగ వ్యక్తి షాపులోకి వచ్చాడు. షాపులో ఉన్న యజమాని శేషూరాం, అతడి కొడుకు సురేష్‌తో మాట్లాడుతూ నగలు ఇవ్వాలని బెదిరిస్తూ కత్తితో శేషూరాం భుజం వద్ద గాయపర్చాడు. ఈ క్రమంలో సురేష్ ప్రాణభయంతో దుకాణంలో ఉన్న మరో గదిలో వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఇద్దరు దొంగలు శేషూరాంను నగలు, డబ్బులివ్వాలని బెదిరిస్తున్న క్రమంలో చాకచక్యంగా దుండగుల నుంచి తప్పించుకొని రోడ్డుపైకి వచ్చి కేకలు వేశాడు. దీంతో దుండగులు వచ్చిన బైక్‌పై పరారయ్యారు. వారికి పట్టుకునేందుకు శేషూరాం, అతడి కొడుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగుడి కత్తిపోటుకు గురైన శేషూరాంను ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. దుకాణంలోని సీసీ ఫుటేజీని తీసుకున్నారు. కాగా పట్టణంలో జరిగిన ఈ ఘటన స్థానికులకు భయభ్రాంతులకు గురిచేసింది. దొంగలు ఏమీ ఎత్తుకపోలేదని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనా స్థలానికి మేడ్చల్ డీసీపీ లిఖిత పంత్, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ సందర్శించి వివరాలు సేకరించారు. దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలను రంగంలో దింపినట్టు డీసీపీ లిఖితపంత్ అన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఆమె తెలిపారు. స్థానిక వ్యాపారులకు ఎల్లవేళలా పోలీసు రక్షణ ఉంటుందని డీసీపీ భరోసా ఇచ్చారు.

ప్లాట్ కబ్జా చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 20: ప్లాట్ కబ్జా చేసిన వ్యక్తిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడకు చెందిన రాదారం జ్యోతి అన్నోజిగూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 58లోని సూర్యనగర్ కాలనిలో 2011లో ప్లాట్ నెంబర్ 56ను కొంతం రామిరెడ్డి నుంచి కొనుగోలు చేశారు. నారపల్లికి చెందిన వేణుగోపాల్ యాదవ్ అదే లేఅవుట్‌లో ప్లాట్ నెంబర్ 57ను కొనుగోలు చేశాడు. వేణుగోపాల్ యాదవ్ తన పక్కను ఉన్న నా ప్లాట్‌ను కబ్జా చేసి షెడ్ నిర్మాణం చేసుకున్నాడు. ఇటీవల తన ప్లాట్‌లో చిన్నపాటి నిర్మాణం చేసుకుందామని వెళితే ప్లాట్‌ను కబ్జాచేసి షెడ్ నిర్మాణం చేసుకున్నాడని, వేణుగోపాల్ యాదవ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాదారం జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు

మేడ్చల్ జూన్ 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ క్రీడా పాఠశాలల్లో నేటి నుండి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతున్నదని జిల్లా యువజన క్రీడల అధికారి బలరాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు నేటి నుండి ఈ నెల 25వ తేదీ వరకు అన్ని మండలాల్లో జరుగుతాయని అర్హత గల బాల బాలికలు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు జిల్లాస్థాయి పోటీలు హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తామన్నారు.

కలెక్టర్‌కు నోట్‌బుక్‌లు అందజేత


కలెక్టర్‌కు నోట్‌బుక్‌లు అందజేస్తున్న పశువైద్య సహాయ సంచాలకులు నోహ

కొడంగల్ రూరల్, జూన్ 20: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు కొడంగల్ పశువైద్య సహాయ సంచాలకులు నోహ నోటుబుక్‌లు అందజేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం కొడంగల్‌లో పర్యటించిన కలెక్టర్‌కు ఆయన నోట్‌బుక్‌లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజుల కిందట కలెక్టర్ తనను కలిసేందుకు వచ్చే వారు శాలువాలు, పుష్పగుచ్ఛాలకు బదులుగా నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లతో రావాలని కోరారు. ఈ మేరకు ఆయనకు నోట్‌బుక్‌లు అందించినట్లు తెలిపారు.

కేజీబీవీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రాంరెడ్డి, లక్ష్మీకాంత్

కొడంగల్ రూరల్, జూన్ 20: విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించేందుకు స్థానిక కేజీబీవీ పాఠశాలలో గురువారం కంప్యూటర్ ల్యాబ్‌ను పీసీజేసీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 కంప్యూటర్‌లు, ఒక ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. ఎంఈవో రాంరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు లక్ష్మీకాంత్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి, ఫౌండేషన్ సభ్యులు మౌనిక, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ, జూన్ 20: రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు కొత్త రుణాలు ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఈవో యాదగిరికి సూచించారు. ఎల్‌టీ రుణాలను చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సొసైటీలో గేదెలపై రుణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు, సభ్యులకు సబ్సీడీ ద్వారా విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతులకు బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలను ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో గోపాల్‌గౌడ్, మచ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

ఘట్‌కేసర్, జూన్ 20: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గురువారం ఓ ప్రైవేటు హోటల్‌ను ఆమె ప్రారంభించారు. యువత స్వయం ఉపాధిరంగాలను ఎంచుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందవద్దని, నలుగురికి ఉపాధి కల్పించే దారి ఎంచుకోవడం అందరికీ ఆదర్శమన్నారు. ప్రధానంగా హోటల్ వ్యాపారంలో ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీ నర్రి శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ కుంభకోణంపై సుప్రీంకోర్టులో విచారించాలి

ఘట్‌కేసర్, జూన్ 20: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కుంభకోణంపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సబిత డిమాండ్ చేశారు. నీట్‌పరీక్షా పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ గురువారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 24లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. బాధ్యులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని, తిరిగి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, చంద్రమోహన్, శ్రీనివాస్, నాగమణి పాల్గొన్నారు.